# దివ్యాంగుల ఫోరంకు 'భారత్ కళా వైభవ్-2026' అవార్డు



**దశ, ఓయూ:** విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంకు 'భారత్ కళా వైభవ్-2026' రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ధూమ్ ధామ్-దమ్ము నీదా? నాదా?' డాన్స్ కాంపిటీషన్ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. దివ్యాంగుల సంక్షేమం, హక్కులు, విద్య, ఉపాధితో పాటు సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో ఫోరం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. డాక్టర్ ఎండీ ఆరిఫ్ వుద్దీన్ చేతుల మీదుగా ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నకరకంటి అశోక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నకరకంటి అశోక్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఫోరం చేస్తున్న నిరంతర కృషికి ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. దివ్యాంగ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్య, ఉద్యోగం, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మారవేణి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజం మొత్తం బాధ్యత అన్నారు. వారి కళా, సాంస్కృతిక ప్రతిభకు మరిన్ని వేదికలు కల్పిస్తామని తెలిపారు. అవార్డు దివ్యాంగుల హక్కుల ఉద్యమానికి మరింత స్ఫూర్తినిస్తుందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు.

# సామాజిక కార్యకర్త రేవల్లే మదన్‌కు గౌరవ డాక్టరేట్



**దశ, తుర్కయంజాల్ :** నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త, ట్రీ సొసైటీ చైర్మన్ రేవల్లే మదన్ (మస్తాన్)కు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది. అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు తమిళనాడులోని పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు న్యాయవ్యవస్థ మాజీ న్యాయమూర్తి డా. కె. వెంకటేశన్ చేతుల మీదుగా రేవల్లే మదన్ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. నిస్వార్థంగా సేవ చేసే వారికి ఎప్పుడైనా, ఎక్కడైనా గౌరవం లభిస్తుందని ఈ సందర్భంగా డా. కె. వెంకటేశన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రిటైర్డ్) పి.ఆర్. శంపత్, యూనివర్సిటీ ఇండియా కంట్రీ డైరెక్టర్ సుకుమార్, డిప్యూటీ డైరెక్టర్ విజయ మోహన్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ట్రీ సొసైటీ ద్వారా రేవల్లే మదన్ గత కొన్ని సంవత్సరాలుగా పలు సామాజిక, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, వొకేషనల్ ట్రైనింగ్, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, మొక్కల పెంపకం, ఆరోగ్య శిబిరాలు, స్వచ్ఛ సర్వేక్షణ, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలతో పాటు విద్య, వైద్యం, బాలల హక్కుల పరిరక్షణ, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సమాజ సేవలో రేవల్లే మదన్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సామాజిక సేవా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు రేవల్లే మదన్‌ను అభినందించారు.

# రేషన్ బియ్యం ఎక్కడ సారూ?

- మూడు నెలల కోటా ఒకేసారి.. దుకాణాల్లో బియ్యం నిల్!
- రేషన్ షాపుల ఎదుట లబ్దిదారుల పడిగాపులు.. డీలర్లకు చెబుతున్నా పట్టించుకోని అధికారులు?
- గడువు ముగుస్తుండటంతో "మా కోటా మాకివ్వరా?" అంటూ పేదల ఆవేదన.

**దశ, పెద్ద అంబర్ పేట:** పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం పంపిణీ వ్యవస్థలో గందరగోళం నెలకొంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్‌లోని పలు రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వలు లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో పాటు, సంబంధిత గడువు కూడా ముగియనుండటంతో తమకు రావాల్సిన కోటా దక్కుతుందో లేదోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉదయం నుంచే రేషన్ దుకాణాల వద్దకు చేరుకుంటున్న లబ్ధిదారులకు "బియ్యం అయిపోయింది.. వచ్చిన తర్వాత ఇస్తాం" అనే సమాధానమే ఎదురవుతోందని వారు వాపోతున్నారు. దీంతో గంటల తరబడి దుకాణాల ఎదుట పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డీలర్లు చెబుతున్నా.. వినేవారెక్కడ?

తమకు పైస్థాయి నుంచి రావాల్సిన రేషన్ కోటా పూర్తిస్థాయిలో అందడం లేదని డీలర్లు చెబుతున్నారు. కోటా కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని వారు వాపోతున్నారు. తాము ఇండెంట్ పెట్టినా పూర్తిస్థాయిలో బియ్యం విడుదల కావడం లేదని, ఈ విషయాన్ని లబ్ధిదారులకు వివరిస్తున్నప్పటికీ వారు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారని డీలర్లు చెబుతున్నారు. తమకు ప్రభుత్వం కేటాయించిన బియ్యం తీసుకోవడానికి రేషన్ దుకాణానికి వస్తే బియ్యం లేకపోవడం ఏమిటని లబ్ధిదారులు నిలదీస్తున్నారు. నెలలు గడిచిపోయిన తర్వాత తమకు రావాల్సిన బియ్యం మిగిలిపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. "మా కోటా ఎక్కడికి



పోతుంది? గడువు ముగిసిన తర్వాత మా బియ్యం ఇస్తారా?" అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

## పేదల బియ్యంపై ఇంత నిర్లక్ష్యమా?

రేషన్ బియ్యం అనేది పేద కుటుంబాలకు కేవలం సరుకుకాదు.. వారి ఇంటి వంటగదికి ఆధారం. అలాంటి నిత్యావసర సరుకుల పంపిణీలోనే ఇంత నిర్లక్ష్యం ఉంటే పేదల పరిస్థితి ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం సరఫరా సక్రమంగా చేయాల్సిన అధికారులు సమస్యను ముందుగానే పరిష్కరించకుండా లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దకు వచ్చిన తర్వాత కూడా స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇదిలా ఉండగా సమస్యపై జిల్లా స్థాయి అధికారులను 'దశ' ప్రతినిధి సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ వారు అందుబాటులోకి రాలేదు.

రేషన్ బియ్యం కోసం ప్రజలు దుకాణాల ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మూడు నెలల కోటా సకాలంలో ఎందుకు అందలేదు? ఇండెంట్ పెట్టిన డీలర్లకు పూర్తి కోటా ఎందుకు విడుదల కాలేదు? గడువు ముగిసేలోపు లబ్ధిదారులందరికీ బియ్యం అందుతుందా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పలేక పోతున్నారు. ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం విషయంలో సాకులు కాదు.. సరఫరా కావాలి. హామీలు కాదు.. బియ్యం కావాలి. గడువు ముగిసేలోపు లబ్ధిదారులందరికీ వారి కోటా పూర్తిగా అందేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పెద్ద అంబర్‌పేట్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పిస్తా హౌస్.. పార్కింగ్ గందరగోళం!



- కస్టమర్ల వాహనాలతో జాతీయ రహదారి 65 ఆక్రమణ.. పట్టించుకోని పోలీసులు?
- సాయంత్రం వేళల్లో మరింత ట్రాఫిక్ తిప్పలు.. ప్రమాదాలకు దారితీస్తున్న ఇష్టారాజ్య పార్కింగ్

**దశ, పెద్ద అంబర్‌పేట్:** రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ సమీపంలోని పిస్తా హౌస్ వద్ద పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. పిస్తా హౌస్‌కు వచ్చే కస్టమర్ల వాహనాలను క్రమబద్ధంగా పార్కింగ్ చేయించే వ్యవస్థ లేకపోవడంతో పలువురు వాహనదారులు తమ వాహనాలను జాతీయ రహదారి-65 వరకు ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏకంగా రహదారి మధ్య భాగం వరకు వాహనాలు నిలిచిపోతుండటంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో కస్టమర్ల రద్దీ పెరగడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాల మధ్యలోనే పార్కింగ్ చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## పట్టించుకోని అధికారులు

జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా పార్కింగ్ జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపితే జరిమానాలు విధించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యత కాదా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పిస్తా హౌస్ యాజమాన్యం కూడా తమ వద్దకు వచ్చే కస్టమర్లకు పార్కింగ్‌పై సరైన సూచనలు ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కస్టమర్లు వస్తున్నారు.. వ్యాపారం జరుగుతోంది.. కానీ వారి వాహనాల పార్కింగ్ వల్ల రోడ్డుపై ఏర్పడుతున్న ఇబ్బందులు మాత్రం ఎవరికీ పట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

జాతీయ రహదారి కావడంతో నిత్యం భారీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి కీలక రహదారిపై రోడ్డు మధ్య వరకు వాహనాలు నిలిపే పరిస్థితిని అధికారులు ఎలా అనుమతిస్తున్నారో అర్థం కావడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ సమస్యను ఇప్పటికైనా పోలీసులు సీరియస్‌గా తీసుకోవాలని, రహదారిపై వాహనాలు నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కాదు.. ముందే చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారిపై పార్కింగ్ పేరుతో జరుగుతున్న ఈ గందరగోళానికి పోలీసులు ఎప్పుడు చెక్ పెడతారో చూడాలి!

# ఎన్టీఆర్‌నగర్ MRPS యువజన కమిటీ ఎన్నిక



**దశ ఓయూ:** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) నూతన యువజన కమిటీ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరపాక అంజి మాదిగ నాయకత్వంలో కార్యక్రమం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం వారిని సన్మానించారు. మల్లాపూర్ ఎన్టీఆర్‌నగర్ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు చేవెళ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి గొల్లూరి సోములు, ఉపాధ్యక్షుడు బొల్లారం యాదగిరి తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కమిటీ: అధ్యక్షుడిగా గొల్లూరి రవి, ఉపాధ్యక్షుడిగా బొల్లారం మనోజ్, ప్రధాన కార్యదర్శిగా చేవెళ్ల సాయి శశాంక్, జాయింట్ సెక్రటరీగా బొల్లారం విగ్నేష్, సలహాదారుగా మదాస్ అజయ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కర్రె ఉదయ్, మద్దూరి కిరణ్, సన్నీ, సిరియాల కుమార్, శ్యామల సాయి బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనతో పాటు ఎన్టీఆర్‌నగర్ పరిధిలో దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో MRPS నాయకులు, దళిత సంక్షేమ సంఘం ప్రతినిధులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దక్షిణ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా పియుబి శర్మ

**దశ, ఓయూ:** దక్షిణ జనతా పార్టీ (డీజేపీ) జాతీయ ఉపాధ్యక్షుడిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ పియుబి శర్మను నియమించినట్లు పార్టీ జాతీయ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పియుబి శర్మకు నియామక పత్రాన్ని అందజేశారు. కర్ణాటక కోఆర్డినేటర్‌గా అభి, తమిళనాడు కోఆర్డినేటర్‌గా సుగురు తులహప్పన్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల హక్కులు, స్వయం ప్రతిపత్తి పరిరక్షణే లక్ష్యంగా దక్షిణ జనతా పార్టీ పనిచేస్తుందన్నారు. దక్షిణాది విద్యార్థులకు నష్టం కలిగిస్తున్నాయని పేర్కొంటున్న నీట్, ఎన్‌టీఏ పరీక్ష విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయాలని, తమిళనాడులో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు.



కర్ణాటకలో ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు కేంద్ర ప్రభుత్వంలోని కీలక శాఖలను ఏర్పాటు చేయాలని, కేరళలో దక్షిణాది ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ద్రావిడ భాషల అభివృద్ధి మండలి ఏర్పాటు చేసి, దక్షిణాభివృద్ధి మండలికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దక్షిణాదికి ఉప ప్రధానమంత్రి స్థాయి పదవి కల్పించాలని, ఉత్తరాది నుంచి ప్రధానమంత్రి ఉంటే దక్షిణాది జోన్లకు ఉప ప్రధానమంత్రి పదవులు ఇవ్వాలని సూచించారు. కేంద్ర మంత్రివర్గంలో దక్షిణాది రాష్ట్రాలకు కీలక శాఖలు కేటాయించాలని, దక్షిణాది రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దక్షిణాది హక్కులను కాలరాస్తున్న ఉత్తరాది ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడటమే దక్షిణ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమావేశంలో డీజేపీ జాతీయ కమిటీ సభ్యులు అలిగె జీవన్, బోయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బంజారా సంస్కృతికి తీజ్ పండుగ నిలువెత్తు నిదర్శనం


**దశ, తుర్కయంజాల్:** బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనకు తీజ్ పండుగ నిలువెత్తు నిదర్శనమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇంజాపూర్‌లో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తీజ్ వేడుకల్లో భాగంగా సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న బంజారా మహిళలు, యువతులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. గిరిజన సోదరీమణుల కోరిక మేరకు మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా బంజారా సంప్రదాయాన్ని గౌరవిస్తూ గోధుమ మొలకలతో కూడిన వెదురు బుట్టను నెత్తిన పెట్టుకుని వేడుకల్లో సందడి చేశారు. బంజారా సంప్రదాయ డప్పుల చప్పుళ్లు, తీజ్ పాటల మధ్య మహిళలతో కలిసి అడుగులు వేస్తూ ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. ఇంజాపూర్‌లో బంజారా సామాజిక వర్గం కోసం నిర్మించతలపెట్టిన హాల్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వేడుకల్లో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'గూడెం కుంట'లో రియల్టర్ల కన్ను...
# చెరువుకే ఎసరు!

- ఇరిగేషన్ హెచ్చరికలు బేఖాతర్.. రాజకీయ పలుకుబడితో రియల్ దందా?
- ప్లాట్లు కొన్న సామాన్యుల పరిస్థితి ఏంటి?





**దశ, తుర్కయంజాల్ :** రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్ పరిధిలో హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న 'గూడెం కుంట'లోనే లేఅవుట్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆరోపణల్లో వాస్తవమెంత అనేది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గూడెం కుంటకు సంబంధించిన సర్వే నంబర్లు 96, 97, 98, 99లోని భూములను 2015లో కొందరు వ్యక్తులు పట్టాదారుల నుంచి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ ప్రాంతం కన్జర్వేషన్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియ పూర్తికాకుండానే లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి.

చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న సమాచారంతో 2024లో ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు సమాచారం. అయినా రెండేళ్లు గడిచినా వ్యవహారం పూర్తిగా ఆగలేదనే ఆరోపణలు అధికారుల తీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

మరోవైపు వెంచర్‌లోని కొన్ని ప్లాట్లకు మున్సిపాలిటీ నుంచి నిర్మాణ అనుమతులు కూడా వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇరిగేషన్ అభ్యంతరాలు ఉన్న ప్రాంతంలో నిర్మాణ అనుమతులు ఎలా వచ్చాయి? గతంలోనే అనుమతులు రద్దు చేయాలని పలువురు కోరినా అధికారులు ఎందుకు పట్టించుకోలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హైదరాబాద్-సాగర్ రహదారికి సమీపంలో ఉండటంతో తక్కువ ధరలకు ప్లాట్లు అంటూ పేద, మధ్యతరగతి ప్రజలను ఆకర్షించి విక్రయాలు జరిపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ జీవితకాల పొదుపుతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు భూమి ఎఫ్‌టీఎల్, బఫర్ లేదా కన్జర్వేషన్ జోన్‌లో ఉందా? భవిష్యత్తులో తమ పరిస్థితి ఏమిటి? అంటూ ఆందోళన చెందుతున్నారు.

సర్వే రికార్డులు, ఎఫ్‌టీఎల్-బఫర్ జోన్ మ్యాపులు, లేఅవుట్, నిర్మాణ అనుమతులు, 2024 ఇరిగేషన్ శాఖ లేఖపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు తేలితే అనుమతులు రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, తెలియక ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## సెప్టెంబర్ 1న ఘనంగా కేసీ గుప్త 107వ జయంతి వేడుకలు

- రాంకోఠి జైన్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తి
- ముఖ్య అతిథులుగా అమరవాది లక్ష్మీనారాయణ, డీజీ దుద్దేళ్ల శ్రీనివాస్



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ విమోచన పోరాటంలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, వాసవీ ఉద్యమ పితామహుడు దివంగత కల్వకుంట్ల చంద్రసేన గుప్త (కేసీ గుప్త) 107వ జయంతి వేడుకలను సెప్టెంబర్ 1న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కాచిగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్త, ప్రాజెక్టు అడ్వైజర్ కొమిరిశెట్టి అనిల్‌కుమార్ వేడుకల వివరాలను వెల్లడించారు. రాంకోఠి పరిధిలోని శ్రీ జైన్ భవన్‌లో జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, డీజీ దుద్దేళ్ల శ్రీనివాస్ (ఐపీఎస్) ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు పలువురు సామాజిక, రాజకీయ ప్రముఖులు పాల్గొననున్నారు.

కేసీ గుప్త జయంతిని పురస్కరించుకుని పలు సామాజిక, సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్యవైశ్య ప్రముఖులు, కులబాంధవులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘం ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ కలగాలి



**దశ సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని తాళ్ళగడ్డ లో శ్రీశ్రీశ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలవడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండటంతో పాటు నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. ప్రజలందరూ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సర్వోత్తమ్ రెడ్డి కోరారు.

## అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడి రాజీనామా



**దశ ఓయూ:** అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఏడల గణేష్ తన పదవికి రాజీనామా చేశారు. తన పదవీకాలం ముగియడంతో 30082026న కమిటీ సభ్యులు, సంఘ సభ్యుల సమక్షంలో అధ్యక్ష పదవితో పాటు కమిటీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి సహకరించిన కమిటీ సభ్యులు, సంఘ సభ్యులకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అరుంధతి సంక్షేమ సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నోటీసుల పేరుతో కాలయాపన..
## అక్రమ నిర్మాణాలకు అధికారుల అండా?



- జోరుగా అక్రమ నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు!
- పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్లలో భారీ షెడ్ల నిర్మాణాలు.. టౌన్‌ప్లానింగ్ తీరుపై విమర్శలు

**దశ, పెద్ద అంబర్‌పేట్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్ పెద్ద అంబర్‌పేట్-52, కుంట్లూరు-51 డివిజన్లలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలను పక్కనపెట్టి అనుమతులు లేకుండానే భారీ షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పెద్ద అంబర్‌పేట్-52 డివిజన్‌లోని తట్టి అన్నారం-జీవీఆర్ కాలనీ వెళ్లే రహదారి వద్ద అనుమతులు లేకుండా భారీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరోవైపు కుంట్లూరు-51 డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామంలో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని మరో భారీ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బహిరంగంగా నిర్మాణ పనులు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత నెలల తరబడి కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఉండాల్సిన గడువుకంటే ఎక్కువ సమయం ఇస్తూ నిర్మాణదారులకు పరోక్షంగా వెసులుబాటు కల్పిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాల్సిన అధికారులు కేవలం నోటీసులతో సరిపెట్టుకుంటే, ఆ గడువులోనే నిర్మాణాలు పూర్తిచేసుకునే అవకాశం అక్రమార్కులకు లభిస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "నోటీసులు ఇస్తారా.. లేక చర్యలు తీసుకుంటారా?" అంటూ స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా భారీ షెడ్లు నిర్మించడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, ఫీజుల రూపంలో ఆదాయానికి గండి పడే పరిస్థితి ఏర్పడుతోందని వారు అంటున్నారు. ఒకవైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతుండగా..మరోవైపు అధికారుల మౌనం అక్రమ నిర్మాణదారులకు అండగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, ఆయా నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుంటే వెంటనే నిర్మాణ పనులను నిలిపివేసి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నోటీసులు జారీ చేసినట్లయితే తదుపరి చర్యలు ఎందుకు చేపట్టలేదో సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.



## డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో..బూత్ ఏజెంట్లకు ఎస్ఐఆర్-2పై అవగాహన

**దశ ఓయు:** మాణిక్యేశ్వరి నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో బూత్ నంబర్లు 210 నుంచి 217 వరకు ఉన్న బూత్ ఏజెంట్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫేజ్ 2 ఓటరు జాబితా నమోదు, సవరణ ప్రక్రియపై ఏజెంట్లకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని గండికోట కుమార్ సూచించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హత ఉన్నవారి వివరాల పరిశీలన తదితర అంశాలపై బూత్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా బూత్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## బోనమెత్తిన యాదగిరిగుట్ట

- దుర్గమ్మకు బోనాల సమర్పణ.. భారీగా పాల్గొన్న మహిళలు



**దశ యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్టలో బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ్‌నగర్‌లోని దుర్గమ్మ దేవాలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోనాల ఉత్సవాలకు ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు వండి బోనం కుండలను నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దుర్గమ్మను వేడుకున్నారు. అష్టైశ్వర్యాలు కలగాలని కోరుతూ స్థానిక మహిళలు అరుణ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఉత్సవాల్లో మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు.



## ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై వుండాలి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై వుండాలని బిజెపి రాష్ట్రనాయకులు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా, నేడు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ శుభ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక మన బోనాల పండుగ. . ఆ తల్లి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బిజెపి పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్, కర్నాటి కిషన్, ఎండి అబిద్, చల్లమల్ల నరసింహ, సలిగంటి వీరేందర్ , పల్సమల్సూర్ గౌడ్, బండపల్లి శ్రీనివాస్, యార్లగడ్డ రామారావు, తాళ్లపల్లి మధు లు పాల్గొన్నారు

## ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# 'పల్లె పల్లెకు వైద్యం' ఉచిత మెగా వైద్య శిబిరం





**దశ ఓయు:** మండలంలోని సింగారం గ్రామంలో భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పల్లె పల్లెకు వైద్యం' కార్యక్రమంలో భాగంగా 142వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చావా రాజ్‌కుమార్ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

బీపీ, షుగర్, న్యూరోపతి, బీఎండీ తదితర పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ చావా రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర దీర్ఘకాలిక వ్యాధుల లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధులను తొలిదశలో గుర్తించి తగిన చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పన్నాల వనజ సత్తిరెడ్డి, ఉపసర్పంచి ఆంజనేయులు గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామానికి వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు సర్పంచి తెలిపారు.